మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## ట్రైనీ కలెక్టర్ మనోజ్ పోలింగ్ కేంద్రం తనిఖీ



పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న ట్రైనీకలెక్టర్, ఆర్డీఓ

**న్యాల్కల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని గురువారం ట్రైనీకలెక్టర్ మనోజ్, ఆర్డీఓ రాంరెడ్డి పరిశీలించారు. పట్టభద్రులు 398 మంది ఓటుహక్కును కలిగి ఉండగా 276 మంది వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 25 మంది ఓటు హక్కు కలిగి ఉండగా 23 మంది సద్వినియోగం చేసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా తహసీల్దార్ భూపాల్, ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కృషి చేశారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** బిజెపి మద్దతుతో పట్ట భద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న చిన్నమైల్ అంజిరెడ్డి గురువారం ఓటు హక్కును సద్వి నియోగం చేసుకున్నారు. రామచంద్రాపురం పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంజిరెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సి అంజిరెడ్డి సతీమణి బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, భారతీ నగర్ కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి దంపతులు, మాజీ ఎంపిపి యాదగిరి యాదవ్, మాజీ సర్పంచ్ దోశారి రామ్మోహన్‌రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.





కలెక్టర్‌తో కలిసి ఎన్నికల పోలింగ్ సర్వేను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు జ్యోతి బుద్ధి ప్రకాష్

## ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ సర్వేను ఎన్నికల పరిశీలకులు జ్యోతి బుద్ధి ప్రకాష్, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరితో కలిసి గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కో ఎడ్యుకేషన్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల శాసనమండలి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు సీరియల్ నంబర్ స్లిప్పులను అందించి ఎంత ఆలస్యమైనా అందరూ ఓటు వేసే వరకు పోలింగ్ నిర్వహించాలని పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హామీద్, ఆర్డీఓ సదానందం తదితరులు ఉన్నారు.

## సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

-సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



చౌటకూరులో ఎమ్మెల్సీ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కాంత్రి వల్లూరు

**చౌటకూరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నార. గురువారం మండల కేంద్రమైన చౌటకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఎన్నికల బ్యాలెట్ పత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేలా చేసిన కృషి ఫలించిందని ఓటింగ్ శాతం రుజువుచేస్తోందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను 40 పోలింగ్ కేంద్రాల్లో, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు 28 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించామన్నారు. పుల్‌కల్ మండలంలో 365 మంది పట్టభద్రులకుగాను 293 మంది, ఉపాధ్యాయులు 26 మందికిగాను 25 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. చౌటకూరులోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, ఆర్‌డిఓ పాండు, ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్‌లు పరిశీలించారు.

## పోలింగ్ కేంద్రాలను..పోలింగ్ సరళి పరిశీలన

సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, పోలింగ్ సరళిని పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిన్నకోడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అన్ని ఏర్పాట్లచేసి విజయవంతం పూర్తి చేశామన్నారు. 32590 పట్టభద్రుల ఓటర్ల కోసం 40 పోలింగ్ కేంద్రాలు చేశామని తెలిపారు. టీచర్స్ ఎమ్మెల్సీ కోసం 3212 మంది ఓటర్లకు గానూ 23 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే నల్గొండ, ఖమ్మం, వరంగల్ టీచర్స్ ఎమ్మెల్సీ పరిధిలోని జిల్లాలో గల కొమురవెల్లి, చేర్యాల, దూల్‌మిట్ట, మద్దూరు మండలాలో 166 మంది ఓటర్లకు గానూ 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే

**శివ్వంపేట, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త) :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శివ్వంపేటలో ఎమ్మెల్యే సునీతరెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది చాలా కీలకమైనదని ఓటు హక్కును వినియోగించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిదని ఆమె అన్నారు. ఆమె వెంట మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, నాయకులు సంతోష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కల్లూరి వెంకటేష్, గోవిందనాయక్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే సునీతరెడ్డి తదితరులు

# ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో ఫిబ్రవరి 27 ప్రభాతవార్త :**

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు గురువారం. సంగారెడ్డి తార డిగ్రీ కళాశాల, జోగిపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతిఒక్క ఓటరు ఓటుహక్కు వినియోగించుకునేలా బిఎల్వోల ద్వారా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వికలాంగులకు పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు వీలుగా ర్యాంప్‌లు ఏర్పాటు చేయడంతోపాటు వీల్‌చైర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 40 పోలింగ్ కేంద్రాలు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మొత్తం 600 మంది ఎన్నికల సిబ్బందితో పోలింగ్ ప్రారంభమైనట్లు కలెక్టర్ తెలిపారు ఈ ఎన్నికల్లో 2690 మంది ఓటర్లు టీచర్స్ ఎమ్మెల్సీ కోసం, 25652 మంది ఓటర్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం జిల్లాలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సరళిపై ప్రిసైడింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అవసరమైన అన్నిరకాల చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. పట్టభద్రుల పోలింగ్ కు సంబంధించి సంగారెడ్డి జిల్లాలోని నాలుగు డివిజన్లో కలిపి 25652 మంది పట్టబద్రులు ఓటువేయాల్సి ఉండగా, 17050మంది పట్టబద్రులు ఓటువేశారని 66.47 శాతం ఓటింగ్ పోలింగ్ అయిందని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 2690 మంది ఉపాధ్యాయులు ఓట్లు వేయాల్సి ఉండగా, 2305 మంది ఉపాధ్యాయులు ఓటును ఉపయోగించుకున్నారు 85.69 శాతం పోలింగ్ నమోదు అయిందని సంబంధిత అధికారులకు తెలిపారు.



సంగారెడ్డిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మెదక్ ప్రభుత్వ జూనియర్ బాలురకళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించారు. ఈసందర్భంగా పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ సరళి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, టీచర్స్ మొత్తం పోలింగ్ కేంద్రాలు 43 ఉన్నాయని, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్ల పట్ల ప్రజల్లో మంచి స్పందన లభించిందని చెప్పారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రాడ్యుయేట్ 43 శాతం పోలింగ్ నమోదు కాగా, టీచర్స్ 77 శాతం పోలింగ్ నమోదు కాబడినదని తెలిపారు. పట్టభద్రుల ఓటర్స్ జిల్లాలో ఎక్కువ ఉన్నందువల్ల మధ్యాహ్నం 3.30 వరకు పోలింగ్ కేంద్రం లోపల ఉన్న వారికి మాత్రమే ఓటు వేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. పట్టభద్రుల పోలింగ్ ఇంకా కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన తాగునీరు, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని, ఎటువంటి పొరపాట్లుకు తావు లేకుండా సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం నిర్దేశించిన రూట్ మ్యాప్ ద్వారా కరీంనగర్ రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్స్‌లను తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తాహశీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



పోలింగ్ కేంద్రం వద్ద బందోస్తు పరిశీలిస్తున్న సీపీ డాక్టర్ అనురాధ

## పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్‌ఎస్ఎస్ సెక్షన్ అమలు

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ అనురాధ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల, బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తుతో పాటు పోలింగ్ సరళని ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు చేశారు. 419తో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉపాధ్యాయ ఎన్నికల్లో 97 శాతం పోలింగ్

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి. పట్టబద్రుల ఎమ్మెల్సీకి మొత్తం ఓట్లు 334 ఉండగా అందులో 267 ఓట్లు పోలు కాగా, 80 శాతం ఓటింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధిచి మొత్తం ఓట్లు 30 ఉండగా అందులో 28 ఓట్లు పోలు కాగా, 93 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ గ్రేసీబాయి తెలిపారు. ఉదయం పట్టణంలోని ఉపాధ్యాయ, పట్టబద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఓటు వేసినట్లు సిరా చూపుతున్న యువకులు

## ఓటు హక్కును వినియోగించుకున్న ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 95 శాతం ఓటింగ్ నమోదు కాగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 83.58 శాతం ఓటింగ్ నమోదైంది. టీచర్స్ ఓటర్లు మొత్తం 20 మంది ఉండగా, పురుషులు 16 మంది, స్త్రీలు ఐదుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోలేదు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మొత్తం 341 గాను పురుషులు 256, స్త్రీలు 85 మంది, వీరిలో పురుషులు 216 మంది, స్త్రీలు 69 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, 56 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని స్థానిక తహశీల్దార్ తెలిఎపారు. మాసాయిపేట మండలంలో పట్టభద్రుల ఓటు హక్కును రాష్ట్ర పీసీసీ కార్యదర్శి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఆవుల రాజిరెడ్డి వినియోగించుకున్నారు.

## ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయం

**కొల్చారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండలంలో గురువారం టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, పోలింగ్‌లో భారీ ఎత్తున భారతీయ జనతా పార్టీకి అభ్యర్థికి ఓట్లు పడ్డాయని, అలాగే రాబోయే స్థానిక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచి స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం శారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, రాజేందర్ గౌడ్, నాని, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పల్లె రవికాంత్, గిరిజన మోర్చా అధ్యక్షుడు పూల్ సింగ్, మండల ఉపాధ్యక్షుడు పొట్టి ప్రకాష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ శేఖర్ యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుర్గయ్య, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌ఛార్జీలు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు హరీష్

# రాష్ట్రానికి ప్రతి ప్రాజెక్టు తేవాల్సి బాధ్యత కిషన్‌రెడ్డిదే

### రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26,ప్రభాతవార్త**

రాష్ట్రానికి ప్రతీ ప్రాజెక్టు తీసుకురావాల్సిన బాధ్యత బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిదే అని రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణం లోని బాలుర ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఓటు హక్కును మంత్రి పొన్నం దంపతులు వినియోగించుకున్నారు. పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజనకు సంబంధించిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గడిచిన పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రాన్ని ఏమీ అడగలేదని కారణం చూపిన కేంద్రం ప్రస్తుత ప్రభుత్వం కాలికి బట్టకట్టుకుని తిరుగుతున్నా ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోఉన్న బిజెపి కేంద్ర మంత్రులు రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా రాష్ట్రానికి కచ్చితంగా నిధులుతేవాల్సిందేనని డిమాండ్ చేశారు.రావాల్సిన నిధులు తీసుకురాకుంటే ఆ నాయకులకు ప్రజలు అసమర్థులుగా చూస్తారని, బిజెపి, బిఆర్ఎస్ వేరు కాదని బావించాల్సి వస్తుందన్నారు. కులగణనపై బిజెపి తప్పుడు ప్రచారాలు చేస్తూ మతపరంగా పబ్బం గడుపుతుందని ఆరోపించారు. తమిళనాడులో అన్ని రాజకీయ విభేదాలు ఉన్నా రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్రంలోఉన్న బిజెపి నాయకలు పెద్దన్న పాత్ర పోషించి నిధులు కేటాయించే ప్రయత్నం చేయాలని లేదంటే తెలంగాణ ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు.



ఓటు వేసిన పొన్నం ప్రభాకర్ దంపతులు

పంటలు ఎండుతున్నాయని సామాజిక మాధ్యమాలలో టీట్లుపెట్టే కేటీఆర్ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని భగవంతున్ని వేడుకోవాలన్నారు.

### ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు నిరసనగా

# ఎమ్మెల్సీ ఎన్నికలు బహిష్కరణ

**గుమ్మడిదల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు నిరసనగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు స్వచ్ఛందంగా బహిష్కరించారు. నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిలిచిపోయేంతవరకు మండల పరిధిలోని గ్రామాలలో నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎన్నికలను విద్యావంతులు, మేధావులు స్వచ్ఛందంగా బహిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అన్ని ప్రజా సంఘాల మద్ధతుతో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, నిరవధిక సమ్మెలను కొనసాగిస్తామని, ఈ ప్రాంత రైతుల ఆత్మగౌరవానికి, ప్రభుత్వానికి మధ్యన జరుగుతున్న పోరాటాన్ని ప్రభుత్వం సమాలోచన చేసి డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేసే దిశగా అడుగులు వేయాలని కోరారు. గుమ్మడిదల పోలింగ్ కేంద్రం పట్టభద్రులు పోలింగ్ బూత్ 219, ఉపాధ్యాయుల ఎన్నికల పోలింగ్ బూత్ 425. మండల వ్యాప్తంగా జరిగిన ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఓటర్స్ 19 మంది ఉండగా 18 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల ఎన్నిక మండల వ్యాప్తంగా 295 ఓటర్స్ ఉండగా సాయంత్రం వరకు కేవలం 42 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవీందర్‌రెడ్డి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మీడియాతో మాట్లాడుతూ ఓటుహక్కును వినియోగించుకునే వారిని ఎవరైనా అడ్డుకోవడం గానీ, భయభ్రాంతులకు గురిచేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రాంత సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యను పరిష్కరించేదిశగా పని చేస్తున్నట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, సీఐ నయీముద్దీన్, ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్




పోలింగ్‌కేంద్రం వద్ద చంటి పాపను ఆడిస్తున్న మహిళా కానిస్టేబుల్, ఓటు వేసేందుకు వచ్చిన వికలాంగుడు

**మర్కుక్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ నియోజకవర్గాల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండలకేంద్రం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో గురువారం ఉదయం 8 గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రంవద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ విధించి బందోబస్తు ఏర్పాటుచేశారు. మండల వ్యాప్తంగా 404 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 355 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా 80 శాతం పోలింగ్ అయ్యింది. ఉపాధ్యాయ ఓటర్లు ఆరుగురు ఉండగా ఆరుగురు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మర్కుక్ పోలింగ్ కేంద్రంలో ఒక వికలాంగ పట్టభద్రుడు ఓటు వేసేందుకు రాగా వీల్ చైర్‌లో ఎన్నికల సిబ్బంది లోనికి తీసుకువెళ్ళి ఓటు వేయించడం జరిగింది. అలాగే ఒక తల్లి తన చంటి పాపతో ఓటు వేసేందుకు రాగా అక్కడే ఉన్న మర్కుక్ మహిళా కానిస్టేబుల్ జ్యోతి ఆ చంటి పాపను తల్లి ఓటువేసి వచ్చేంత వరకు ఆడించింది.

## 25వ రోజుకు చేరిన నిరసన



నిరసనలో పాల్గొన్న పాస్టర్స్ అసోసియేషన్

**గుమ్మడిదల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల జేఏసీ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. 25వ రోజు గురువారం జేఏసీ ఆధ్వర్యంలో మండల ఫాదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహిళలు స్వచ్ఛందంగా రోడ్డుపైకి వచ్చి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్నటువంటి డంపింగ్ యార్డ్ అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మండల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ చిమ్ముల జైపాల్ రెడ్డి, కుమార్‌గౌడ్, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, పుట్ట నర్సింగరావు, ఎం. నరేందర్‌రెడ్డి, చిమ్ముల దేవేందర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, చెన్నంశెట్టి ఉదయ్ కుమార్, ప్రతాప్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, బాల్ రెడ్డి, తులసీ దాస్, చిమ్ముల నరసింహారెడ్డి, పడమటి లక్ష్మారెడ్డి, పడమటి మహిపాల్ రెడ్డి, తుడం శ్రీనివాస్, బుడగజంగం ఆంజనేయులు, అమ్మవారి ప్రవీణ్ రెడ్డి, చంద్రారెడ్డి, కొత్తపల్లి మల్లేశంగౌడ్, మండల పాస్టర్ అసోసియేషన్ నాయకులు దినకర్, మాత్యుకుట్టి, పద్మారావు, ఏసుదాసు, పాల్సన్ జాన్ పాల్, వరప్రసాద్, యోహాన్, జాన్ స్టీఫెన్, సామ్యూల్ పాల్, సభ్యులు పాల్గొన్నారు.

## ఒబిసి వెల్దుర్తి మండల అధ్యక్షుడిగా వెంకటేష్

**వెల్దుర్తి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:**

వెల్దుర్తి మండల ఓబీసీ అధ్యక్షులుగా మానెపల్లి ఆశమ్మగారి వెంకటేష్‌ను నిర్ణయించడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు దాసు, మండల మాజీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, బీజేపీ మండల మాజీ మండల అధ్యక్షులు చెంది నరసింహులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నవీన్, వెంకటేశం, శివరాములు, బీజేపీ మండల అధ్యక్షులు నవీన్, యుగేందర్, రమేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు. అలాగే వెల్దుర్తి మండల మహిళా అధ్యక్షురాలుగా కమ్మరి మోనికను ప్రకటించడం జరిగింది.



ఒబిసి మండల అధ్యక్షులు వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం



శివపార్వతుల కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతరెడ్డి, నాయకులు

## అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణం

**శివ్వంపేట, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో ఉమా మహేశ్వర ఆలయంలో మాజీ జడ్పిటిసి పబ్బా మహేష్‌గుప్తా ఆధ్వర్యంలో శాస్త్రుల వామనశర్మ మంత్రోచ్చరణ మధ్య శివ పార్వతుల కళ్యాణం అంగ రంగ వైభవంగా జరిగింది. శివపార్వతుల కళ్యాణానికి ఎమ్మెల్యే సునీత రెడ్డి హాజరై మొక్కలు చెల్లించుకున్నారు. శివపార్వతుల కళ్యాణానికి వచ్చిన భక్తులకు మాజీ జడ్పిటిసి పబ్బా మహేష్ గుప్తా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కోప్షన్ సభ్యులు మన్సూర్, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, గొర్రె వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యాద గౌడ్, ప్రభాకర్ రెడ్డి, కల్లూరి వెంకటేష్, మాజీ సర్పంచులు పత్రాల శ్రీనివాస్ గౌడ్, చంద్రకళ శ్రీశైలం, అనూష అశోక్ గౌడ్, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**రామాయంపేటలో...**

**రామాయంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రామాయంపేట మార్కండేయ దేవాలయంలో నాగులమ్మ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయంలో, అయ్యప్పస్వామి దేవాలయం ప్రాంగణంలోని శ్రీ చిదానంద భువనేశ్వర దేవాలయం (స్పటిక లింగం) లలో శివపార్వతుల కళ్యాణం కన్నుల పండుగగా జరిగాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాలు కొనసాగగా, రాత్రి సమయంలో దేవాలయాలలో కళ్యాణము నిర్వహించారు. బ్రాహ్మ ణుల వేద మంత్రాల మధ్య శివ పార్వతుల కళ్యాణం చూడముచ్చటగా జరిగింది. రాత్రి సమయంలో నిర్వహించిన కళ్యాణంలో చాలామంది భక్తులు పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలను పొందారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో, వివిధ రకాల పుష్పాలతో దేవాలయాలను అలంకరింప చేశారు. రామాయంపేట మున్సిపల్ పరిధిలోని గొలిపర్తి పాండచెరువు కట్టకింద ఉన్న నాగులమ్మ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు గత సోమవారం నుండి గురువా రం వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగానే శివపార్వతుల కళ్యాణం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. కాగా స్థానిక మార్కండేయ దేవాలయం, చిదానంద భువనేశ్వర దేవాలయంలో కూడా నిర్వాహకులు అంగరంగ వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహో త్సవం జరిపారు. భక్తులు ఉపవాస దీక్షలు ఉండి, రాత్రి జాగరణ చేస్తూ కళ్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పద్మశాలి సంఘం అధ్యక్షుడు మద్దెల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దెల సత్యం, జిల్లా సంఘం కార్యదర్శి బల్ల యాదగిరి, నాయకులు సామల రవి, రాజమౌళి, బల్ల యాదగిరి, మోహన్, సుధాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా జోగినాథస్వామి గిరి ప్రదక్షిణ

**జోగిపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** జోగినాథస్వామి గుట్ట గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం అనంతరం గురువారంనాడు జోగిపేటలోని జోగినాథస్వామి ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని మొదటిసారిగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉదయం జోగినాథస్వామి మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం వేదపండితులు నిర్ణయించిన సమయం ప్రకారం మధ్యాహ్నం 3.51 గంటలకు గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని అంగరంగవైభవంగా నిర్వహిం చారు. ముందుగా వేదపండితుల సమక్షంలో గోమాత పూజ నిర్వహించిన అనంతరం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంకోసం గత కొన్ని రోజుల ముందు నుంచే పెద్దఎత్తున ప్రచారం నిర్వహించటంతో భక్తులు భారీ సంఖ్యలో గిరిప్రదక్షిణకు తరలివచ్చారు. ముందుగా ఆలయకమిటి సూచనలమేరకు సాంప్రదాయ దుస్తులలో గిరి ప్రదక్షిణకు భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు బద్రప్ప, వేదపండితులు రమణ శర్మ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘణంగా జరిగింది. ఈ కాం క్రమంలో ఆలయకమిటి సభ్యులు డాకూరి శివశంకర్, రంగ సురేష్‌గుప్త, సురెందర్‌గౌడ్, పట్లూరి శివశేఖర్, చింతల సురేష్, హెచ్.రామాగౌడ్, చాపల వెంకటేశం, బస్వ శివకుమార్, చాపల వెంకటేశం, బేలూరి రవీందర్, డాకూరి శ్రీనివాస్, తుపాకుల సునీల్‌కుమార్, పురం లక్ష్మన్, వెల్డింగ్ మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల ఊరేగింపు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** సోమేశ్వర స్వామి బ్రహ్మో త్సవాల సందర్భంగా చిన్నశంకరంపేట మండల కేంద్రంలో శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం, మంగళ హారతి, అర్చన గుమ్మటాల ఊరేగింపు, హరికథ భజనలు నిర్వహించారు. రుద్రారంలో సంగమేశ్వర ఆలయంలో జలపందిరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా పట్టణ మాజీ సర్పంచి మాట్లాడుతూ ఉత్సవాలకు భజనలు, సకల సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

## దేవాలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు : ఎమ్మెల్యే

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** దేవాలయాలు ఆధ్యాత్మి కతకు నిలయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. గురువారం నాడు చిన్నశంకరంపేట పట్టణంలోని శ్రీ సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ తాజా మాజీ సర్పంచి రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు శ్రీమన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జనార్ధన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## సప్తహా కార్యక్రమంలో చైర్మన్ మచ్చేందర్

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖానా పూర్‌లో హనుమాన్‌ఆలయంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తహా కార్యక్రమంలో జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుట్టిపు మచ్చేందర్ గురువారం పాల్గొన్నారు. గ్రామంలో అఖండ హరినామ సప్తహా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు, జిల్లా సాగర సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్య, నాయకులు గట్టిపు శ్రీనివాస్, జ్ఞానేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మైకోడ్‌లో శివపార్వతుల శోభాయాత్ర

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పంచగామలో కొలువున్న నాగేశ్వర దేవాలయంలో మహాశిరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని మైకోడ్ నుంచి చిన్నారులను శివపార్వతులచే వేషాదారణం వేయించి గ్రామం నుంచి మనూర్ మీదుగా రథంపై శివపార్వతుల వేషాదారులను కూర్చుబెట్టుకుని భజనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

## మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్‌లు దర్శించుకొని స్వామివారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లా డుతూ మహా శివరాత్రి నిబద్ధత, అచంచల విశ్వాసం, త్యాగానికి ప్రతీకగా భక్తులందరూ ఉపవాసదీక్షలు, జాగారాలు పాటిస్తూ భక్తి శ్రద్ధలతో శివార్చన చేయడం గొప్ప ఆనందదాయకమని పేర్కొన్నారు. సృష్టి లయకారునిగా భవభయహరుడైన శివుడు తెలంగాణ ప్రజలకు, పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను కలిగించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్,వ రాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి, ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శకటోత్సవం

**జిల్లెడు చౌదరిగూడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

జిల్లెడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో గురువారం శ్రీ సోమలింగేశ్వరస్వామి దేవాలయంవద్ద శకటోత్సవకార్యక్రమాన్ని గ్రామ స్థులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామప్రజలు శకటోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

# కీసరగుట్టలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



విద్యుత్ కాంతులతో స్వామివారి ఆలయం



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



శివలింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

**కీసర, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి మహ శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగవరోజైన గురు వారం స్వామికి ఆలయచైర్మన్ తటాకం నారయణ శర్మ, వేదపండితులు మహాన్యాసపూర్వక రుద్రాభి షేకం, సామూహిక అభిషేకాలు (కళ్యాణమండపం లో), రుద్రస్వాహాకారహోమం, ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం తదితర పూజాకార్యక్రమా లు ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి కీసరగుట్టకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అంగడి లో భక్తులు వివిధరకాల వస్తువులను కొనుగోలు చేశారు. జిల్లా శానిటేషన్ అధికారులు ఆలయ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంచేస్తూ పరిశుభ్రంగా ఉంచారు. కీసరగుట్ట పరిసరప్రాంతం అంతా శివనామస్మరణతో మారుమ్రోగింది. మున్నూరుకాపు, వంశీరాజ్ సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానాలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కట్టాసుధా కర్‌రెడ్డి, ధర్మకర్తలు నల్ల మధుసూధన్‌రెడ్డి, పోచబోయిన రాజు, రెడ్డబోయిన ప్రవీణ్‌కుమార్, మొరుగు ముత్యాలు, దుండిగల దుర్గాప్రసాద్‌గౌడ్, సామల అమరేందర్, నల్లోల కుమార్, కందాడి రాజిరెడ్డి, జూపల్లి సాయిలు పాలొన్నారు.

**ఆలయంలో నేటి పూజా కార్యక్రమాలు...**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం మహాన్యాస రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు (కళ్యాణమండపంలో) అన్నాభిషేకం, ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, వసంతోత్సవం, పుష్పయాగం తది తర పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి.

**అన్నదానం మహాదానం...**

అన్నదానం మహాదానమని మండల రెడ్డిసంఘం అధ్యక్షులు రామిడి విజయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కీసరగుట్టలో శ్రీభవానీరామలింగేశ్వరస్వామి మహ శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సందర్భంగా కీసరగుట్ట రెడ్డిసంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభంనుండి మొత్తం నాలుగు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. నాలుగురోజులపాటు నిరం తరంగా భక్తులకు అన్నప్రసాదం అందజేశామ న్నారు. రెడ్డిబంధువులు భక్తిభావంతో ఈమహా దానంలో పాల్గొని పుణ్యం సంపాదించుకున్నారని అన్నారు. భక్తులందరికీ ఆత్మసంతృప్తిని అందించిన రెడ్డిసంఘం అసోసియేషన్‌కు భవననిర్మాణ దాత లకు హృదయపూర్వక కృతజ్ఞతలు భక్తులు తెలియ జేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈసేవా కార్యక్రమాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ భవిష్యత్తులో మరింత వైభవంగా నిర్వ హించనున్నట్లు అసోసియేషన్‌నేతలు ప్రకటిం చారు. ఈకార్యక్రమం విజయవంతంగా సాగడంలో ప్రభుత్వం అందించిన సహకారాన్ని నేతలు ప్రత్యే కంగా కొనియాడారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా కొనసాగుతున్న ఈసేవాకార్యక్రమం భక్తులకు ఆధ్యా త్మిక ఆనందాన్ని పంచుతుండటం విశేషం. ఈ కార్యక్రమంలో రెడ్డిసంఘంనేతలు రామిడి ప్రభాకర్ రెడ్డి, పన్నాల బుచ్చిరెడ్డి, బలిజ అంజిరెడ్డి, గుర్రం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జెఎసికి విరాళం అందజేత

**గుమ్మడిదల, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** డంపింగ్ యార్డ్ హటావో.. గుమ్మడిదల మండలం బచావో అంటూ గురువారం మండలంలోని చర్చి పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెలో నిర్వహించారు. ప్రెసిడెంట్ దినకర్ మాట్లాడుతూ పచ్చని పంట పొలాల్లో ప్రభుత్వం చిచ్చు పెడుతుందని, వెంటనే నల్లవల్లి ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్నటువంటి డంపుయార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన జేఏసీకి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల పాస్టర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ పాస్టర్ మత్యుకుటు, ట్రెజరర్ పాస్టర్ పద్మారావు,పాస్టర్ పాల్ సన్, పాస్టర్ జాన్ పాల్, పాస్టర్ వరప్రసాద్, బ్రదర్ యోహాను, బ్రదర్ జాయిల్ స్టీవెన్, పాస్టర్ సామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా ఉమా సంగమేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు మూడవ రోజు కొన సాగాయి. గురువారం ఆలయంలో ఉమా సంగమేశ్వర స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చరణల మధ్య ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం శకట భ్రమనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరలో వివిధ గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి యువకుల కేరింతలు, డప్పుచప్పుళ్ల మధ్య అంగరంగ వైభవంగా ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేయించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐ శంకర్, తహశీల్దార్ గ్రేసీబాయి, ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసాలు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వైభవంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణం

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** బీరంగూడ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో మహా శివరాత్రి పురస్కరించుకొని గురువారం రోజు వీర శైవ ఆగమ పండితుల మంత్రోచ్చరణల మధ్య వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా, కన్నుల పండుగలా జరిగింది. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మంగళ వాయిద్యాల మధ్య ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మూడవ రోజు మహోత్సవంలో భాగంగా ఉదయం నిత్య పూజలు, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీ లలిత సహస్ర పారాయణం, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం, సాయంత్రం స్వామివారికి రథోత్సవం,రాత్రి హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణోత్సవంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ దంపతులు, కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ , మాజీ ఆలయ కమిటీ చైర్మన్ తులసిరెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి శశిధర్, నాయకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అంజన్నగౌడ్‌ని సన్మానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

చేగూరు గ్రామంలో శివపార్వతుల విగ్రహాలను బహుకరించిన మంచన్‌పల్లి అంజన్నగౌడ్‌ను గురువారం షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందిం చారు. వెంకమ్మగూడలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ వేడుక లకు వచ్చిన ఆయన అంజన్నగౌడ్‌కు శాలువావేసి సన్మానించారు. వేడుకల్లో మాజీ ఎంపీపీ ఎం.శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును పోలీసులు అడ్డుకోవడం అసమంజసం

**-రాష్ట్ర సహకార యూనియన్ మాజీచైర్మన్ రాజావరప్రసాద్**

**షాద్‌నగర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

మేడిగడ్డ బ్యారేజీలోని ఒక పిల్లర్ చూడడానికి వెళ్లిన రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీలను తాము అడ్డుకోలేదని, కానీ నేడు రేవంత్‌రెడ్డి పాలనలో ఇందిరమ్మ కాలంనాటి నియంతృత్వపాలనను మళ్లీ చూస్తున్నామని తెలంగాణరాష్ట్ర సహ కార యూనియన్ మాజీచైర్మన్ రాజావరప్రసాద్ ఆరోపించారు. మాజీ నీటి పారుదలశాఖ మంత్రి ఏడుసార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎంతో అనుభవం ఉన్న హరీష్‌రావును పోలీసులు నాగర్‌కర్నూల్‌వద్ద అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఎస్ఎల్‌బిసి ప్రమాదఘటనను పరిశీలించడానికి వెళ్తున్న హరీష్‌రావును ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అడ్డుకోవడం తగదన్నారు. రక్షణబృందాలు సమన్వయంసాధించడంలో ప్రభుత్వం విఫల మైందని, టన్నెల్‌లోకి వెళ్లేందుకు హరీష్‌రావు, తదితరులకు అనుమతి ఇవ్వ లేదన్నారు. సహాయచర్యలకు ఇబ్బంది అవుతుందని, ఇన్నిరోజులు ఎవరు రాలేదని, ప్రజాప్రతినిధులు మంత్రిని కలవకూడదా..? ప్రమాదానికి సంబం ధించిన విషయాల గురించి మాట్లాడకూడదా..? ఇదెక్కడి ప్రజాపాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజావరప్రసాద్ నిలదీశారు. ఆరురోజుల తర్వాత తీసింది కేవలం తట్టెడుమట్టి మాత్రమే అని, 8మంది ప్రాణాలు కాపాడడం పట్ల ఈరాష్ట్రప్రభుత్వానికి ఉన్నచిత్తశుద్ధి ఇదేనా..? కాంగ్రెస్ సర్కార్ అవినీతి, నిర్లక్ష్యంతో 15నెలల్లోనే 4ప్రాజెక్టులు కూలిపోయాయని తెలిపారు. ప్రమాద ఘటనలో చిక్కుకున్న 8మంది కార్మికులప్రాణాలు కాపాడేవిషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

## పులిచర్లకుంట తండాలో సమగ్ర కుటుంబ సర్వే



పులిచెర్లకుంట తండాలో సమగ్ర కులగణన సర్వేచేస్తున్న అధికారులు

**దుద్యాల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పులిచర్లకుంట తండాలో సమగ్ర కులగణన సర్వే గురువారం నుంచి ప్రారంభమైంది. గతకొన్ని రోజులుగా ఈతండాకు చెందిన గిరిజనవాసులు లగచర్ల ఘటనలో బాధితులుగా ఉన్న నేపథ్యంలో జైలులో శిక్షను అనుభవించారు. వారి కుటుంబసభ్యులు భయాందోళనలకు గురై తండానువిడిచి ఇతరప్రాంతాల్లో సేదతీరుతున్నారు. దీంతో సమ గ్ర కులగణన సర్వేచేయడానికి ఆతండాలో ప్రజలులేపోవడంతో సర్వేను అక్కడ జరుపలేక పోయారు. ప్రస్తుతం ఆతండాలోప్రజలు అందుబాటులో ఉండడంతో తండాకు చెందిన ప్రజల వివరాలను పంచాయతీ కార్యదర్శి ఆనంద్ సేకరిస్తున్నారు.వారి వివరాలను త్వరలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో గోపాల్‌నాయక్, ప్రవీణ్‌రాథోడ్, పాండ్యానాయక్, మాణిక్యానాయక్, బోజ్యానాయక్ తదితరులు ఉన్నారు. ప్రభుత్వ పథకాలు వద్దు మా భూములు మాకు చాలు..మా గిరిజనుల భూములు గుంజుకోవాలని ప్రభుత్వం చూస్తుందని అందుకే మాకు ప్రభుత్వపథకాలు వద్దు.. మా భూములు మాకుంటే చాలు అని తండావాసులు వాపోతున్నారు. ప్రభుత్వం మాకు భూములులేకుండాచేస్తుందని అలాంటిసందర్భంలో మాకు ప్రభుత్వ పథకాలు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు వివరాలు సేకరి స్తుంటే వద్దనకుండా నమోదు చేస్తున్నామని గిరిజనులు చెప్పుకొచ్చారు.

# వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులతోనే దేశాభివృద్ధి

**-షాద్‌నగర్‌లో 'శ్రీ ఫౌండేషన్' ప్రారంభం**
**-హాజరైన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

వ్యవసాయరంగంలో ఎప్పటికప్పుడు విప్లవాత్మక మార్పులతోనే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఉద్యానవనశాఖ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్‌మండలం ఎలికట్ట గ్రామంలో విశ్రాంత ఉద్యోగులు ఏర్పాటుచేసిన 'శ్రీ ఫౌండేషన్'ను స్థానిక మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులుతో కలిసి ప్రారంభించారు. శ్రీఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈసమావేశానికి రైతులు, రిటైర్డ్ టిఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో రెండుకోట్ల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయం సాగుతోందని అన్నారు. ఇందులో 12.5లక్షల ఎకరాల్లో ఉద్యాన వనపంటలు సాగుచేస్తున్నారని అన్నారు. మారుతు న్న కాలానికి అనుగుణంగా స్పందించకపోవడం, మార్కెట్‌ధరల హెచ్చుతగ్గులను గమనించకపో వడం, సాంకేతిక పరిజ్ఞానం వాడుకతీరు హెచ్చు తగ్గులుకావడం తదితర అంశాలతో రైతులు అవగాహనలేక పంటవిధానాల్లో రాబడిని కోల్పోతు న్నారని వివరించారు. ప్రస్తుతం వ్యవసాయరంగం లో కూరగాయలపంటలు సరిగ్గా పండించలేక పోతున్నామని, రాజస్థాన్‌రాష్ట్రంనుండి కూరగాయ లను దిగుమతి చేసుకోవడం దౌర్భాగ్యమని అన్నా రు. రాజస్థాన్‌లో వర్షాపాతం మూడు శాతమేనని అయినా వారు సాంకేతిక పరిజ్ఞానంతో విప్లవాత్మక మార్పులతో కూరగాయల సాగును చేస్తున్నారని గుర్తుచేశారు. అన్నివనరులుగల తెలంగాణరైతాంగం తెలుసుకోలేక సాగు చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

**భూములు అమ్ముకోకండి: మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు...**

రైతాంగం వ్యవసాయం చేసుకోవాలని, భూముల ను ఎంతమాత్రం అమ్ముకోకూడదని మాజీ ఎమ్మె ల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సిం హులు సూచించారు. గోవులనుసైతం అమ్ముకోకూ డదని, గోసంరక్షణ సాధ్యం కాకపోతే వాటిని ఇతరులకు ఇవ్వాలని సూచించారు.

**శ్రీఫౌండేషన్‌సేవలు విస్తృతం: డాక్టర్ శ్రీనివాస్‌రావు**

శ్రీఫౌండేషన్ ద్వారా సేవలను విస్తృతం చేస్తామని ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.శ్రీనివాస్‌రావు అన్నారు. విద్య, వ్యవసాయం గ్రామీణ అభివృద్ధి, మహిళాశక్తిచైతన్యం, ఉద్యానవనం, యువత స్వయం ఉపాధి, కళాకారులకు ప్రోత్సాహం, ఆర్థిక ప్రగతి, బ్యాంకింగ్ సేవలు, దివ్యాంగుల సేవా కార్యక్రమాలు, అర్బన్ హార్టీకల్చర్, తదితర సేవలను శ్రీఫౌండేషన్‌ద్వారా లక్ష్యాలను నిర్దేశించి నట్లు ఆయన తెలిపారు.

## వీరాపూర్‌లో సిసి రోడ్డు పనులు



సిసిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

**చౌడాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని వీరాపూర్‌గ్రామంలో పరిగి ఎంఎల్ఏ డాక్టర్ రామ్మో హన్‌రెడ్డి ఆదేశాలమేరకు మండల అధ్యక్షులు అశోక్‌కుమార్, వీరాపూర్ గ్రామ కాంగ్రెస్‌పార్టీ నాయకులతోకలిసి సిసిరోడ్డు పనులు ప్రారంభిం చారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వంలో ప్రతి పల్లెలో రోడ్డునిర్మాణాలుచేపట్టి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామ న్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాములు, గ్రామకమిటీ అధ్యక్షుడు సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, బూపత్‌రెడ్డి, శరత్‌కుమార్, సంపత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## శ్రీశైలం మల్లికార్జునుడి కృప అందరిపై ఉండాలి

**-బిఆర్ఎస్ యువనాయకుడు రవీందర్‌యాదవ్**



బిఆర్ఎస్ యువనాయకుడు రవీందర్‌యాదవ్, తదితరులు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

శ్రీశైల భ్రమరాంబికామల్లికార్జునస్వామి కృప అందరిపై ఉండాలని బిఆర్ఎస్ యువనాయకుడు వై.రవీందర్‌యాదవ్ ఆకాంక్షించారు. గురు వారం స్థానిక బిఆర్ఎస్, బిఆర్ఎస్‌వి నాయకులతోకలిసి శ్రీశైల భ్రమరాం బికామల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. మహాశివరాత్రిని పురస్కరిం చుకొని స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రవీందర్‌యాదవ్‌తో పాటు ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబల్‌నాయక్, బిఆర్ఎస్ యువతవిభాగం నాయకులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## గుణవత్తాయాత్రపై ఒక్కరోజు వర్క్‌షాపు



క్యూసిఐ గుణవత్తాయాత్ర వర్క్‌షాపులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎన్‌బిక్యూపి సలహాదారుడు వేణుగోపాల్

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో క్యూసిఐ గుణవత్తాయాత్రపై ఇంజినీరింగ్ విద్యార్థులకు ఒక్కరోజుపాటు వర్క్‌షాపు నిర్వహించారు. సివిల్ ఇంజినీరింగ్‌విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్యూసిఐ గుణవత్తాయాత్రపై నిర్వహించిన వర్క్‌షాపుకు బెంగుళూరు ఎన్‌బిక్యూపి భారతనాణ్యతామండలి సలహాదారు సి.వేణుగోపాల్ హాజరై జ్యోతిప్రజ్వలనచేశారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ఇంజినీ రింగ్, ఇతరపరిశ్రమల్లో నాణ్యతనియంత్రణ ప్రాముఖ్యత, ప్రమాణీకరణ ధృవీకరణ ప్రక్రియల విలువను వివరించారు. ఎన్ఏబీఎల్, ఎన్ఏబిసిబి, జడ్ఈడి ప్రమాణీకరణల గురించి సమగ్ర అవగాహన కల్పించారు. పరిశ్రమనిపుణులు, అకడెమిషియన్లు, విద్యార్థులకు ప్రమాణీకరణ ప్రయోజనాలను అర్థంచేసుకోవడానికి వర్క్‌షాపు ఎంతో ఉపయోగపడు తుందని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డీన్ విజయ్‌కుమార్, డాక్టర్ బి.నరేందర్, కె.సునీల్‌కుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

## పేదలకు సహాయం అందించడమే కాంగ్రెస్‌పార్టీ లక్ష్యం

**-కాంగ్రెస్‌పార్టీ బ్లాక్‌బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్**

**కుల్కచర్ల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

పేదలకు సహాయం అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్ కుమార్ అన్నారు. గురువారం కుల్కచర్ల మండల పరిధిలోని క్రిస్మస్ ముద్రంగ్రామంలో పుర్ర బాలమ్మ మరణించడంతో అంత్యక్రియలనిమిత్తం ఆమెకు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాభావాన్ని పెంపొందించుకొని పేదలు ఆపదలో ఉన్న సమయంలో సహాయమందించాలని ఆయన తెలిపారు. ఈవిషయంలో కాంగ్రెస్‌పార్టీ ముందుంటుందని, పలువురు నాయకులుకూడా ఎంతోమందికి సహాయం అందిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ యూత్ అధ్యక్షుడు మహమ్మదా బాద్ సత్యం, గ్రామనాయకులు గజ్జి రాములు, పుర్ర చెన్నయ్య, పుర్ర ఆశయ్య, గజ్జి పాపయ్య, గజ్జి భాస్కర్, పానగారి లక్ష్మయ్య, డి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

**-ఎంపిడిఓ ఎంఎ కరీం...**



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఓ కరీం

**పరిగి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంఎ కరీం అన్నారు. గురువారం పరిగి మండల కేంద్రంలోని చిగురాల్‌పల్లి గ్రామపంచాయతీని ఆయన సందర్శించారు. జిల్లాకలెక్టర్ ఆదేశానుసారం పంచాయతీలో గ్రామప్రజలందరూ మరుగు దొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యంగా జీవించాలని ఆయన తెలిపారు. పరిసరప్రాంతాలు శుభ్రంగా ఉండాలని గ్రామపంచా యతీ కార్యదర్శికి ఆదేశించారు. గ్రామంలో అందరూ ఇంటిపన్నులు సకా లంలోచెల్లించాలని గ్రామప్రజలకు తెలియజేశారు. వేసవికాల సందర్భం గా ప్రతి ఒక్కరూ నీటిని వృథాచేయకుండా పొదుపుగా వాడుకోవాలని తెలియజేశారు. గ్రామంలో నర్సరీ, పారిశుధ్య పనులు, త్రాగునీటి సరఫరాపనులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానికకాంగ్రెస్ యువ నాయకులు సలీమ్, జంగయ్య, పంచాయతీకార్యదర్శి సుమిత్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ విఆర్ఓ భీమిరెడ్డి మృతి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:**

కొందుర్గుమండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తండ్రి భీమిరెడ్డి గురువారం మృతిచెందారు. అనారోగ్యంతో భీమిరెడ్డి మృతిచెందినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. నేడు ఉదయం 11గంటలకు ఆగిర్యాల గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు ఉంటాయని పేర్కొన్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న నాయకుల దృశ్యం

## ఓటుహక్కును వినియోగించుకున్న మాలమహానాడు నేతలు

**కోహెడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** గురువారం జరిగిన కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటుహక్కును జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజక వర్గ కన్వీనర్ ఆరే కిషోర్ పట్టభద్రులతో కలసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయమే కోహెడలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని బూత్‌లలో ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈసారి పట్ట భద్రులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు. ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో సంఘం నాయకులు ఆరే శ్రావణ్, రజిత, శరత్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ఓటు వేసిన మాజీ ఎంపిపి



ఓటు వేసినట్లు చూపుతున్న మాజీ ఎంపిపి, పిఎసిఎస్ వైస్ చైర్మన్

**మర్కుక్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ నియోజకవర్గాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపిపి పాండుగౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బాలరాజు, వంటి మామిడి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాందాస్‌గౌడ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాళ్లబండి బాలకృష్ణ, చింతకాయల స్వామి, రాజు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**ఓటును వినియోగించుకున్న 74శాతం పట్టభద్రులు.. 94శాతం ఉపాధ్యాయులు**



మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్ల దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ఉదయం 8 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమైంది. ఎన్నికల సిబ్బంది ఉదయమే మాక్ పోలింగ్ నిర్వహించి ఎన్నికల సామాగ్రిని సరిచేసుకున్నారు. హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లలో ఉదయం ఎన్నిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఉదయ 10 గంటల వరకు హుస్నాబాద్ 57శాతం, కోహెడ64శాతం, అక్కన్నపేటలో 53 శాతం, బెజ్జంకిలో 59 శాతం మంది ఓటుహక్కును వినియోగించుకోగా సాయంత్రం నాలుగు గంటలు పూర్తయే సరికి మొత్తంగా హుస్నాబాద్ 74శాతం, అక్కన్నపేట 71శాతం, కోహెడలో 74శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా బెజ్జంకిలో 74శాతం మంది పట్ట భద్రులు తమ హక్కును వినియోగించుకోగా మొత్తానికి టీచర్లు 94 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి, తహసీల్దార్ రవిందర్‌రెడ్డి తెలిపారు.

**మనూర్‌లో...**

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 419మంది పట్టభద్రులకుగాను 309 మంది, 16 మంది ఉపాధ్యాయులకుగాను 16మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ఎస్ఐ శంకరయ్య, ఆర్ఐ శంకర్‌రెడ్డి, ఎఎస్ఐ గోవింద్ చర్యలు తీసుకున్నారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**పాపన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎన్నికల సరళిని ఎమ్మెల్యే రోహిత్‌రావు పరిశీలించారు.

## మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

**బెజ్జంకి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 1434 మంది పట్టభద్రుల ఓటర్లకు గానూ 1077 మంది ఉపాధ్యాయులు 48 మంది ఉండగా 44 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 75.10 శాతం, ఉపాధ్యాయుల ఓటింగ్ శాతం 91.06 నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే

**పాపన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్‌రెడ్డి గురువారం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండలంలో 86 మంది ఉపాధ్యాయులకు గాను 81మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు ఎన్నికల సమయం ముగిసినా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు సమయాన్ని కేటాయించారు. ఎన్నికల పోలింగ్ సరళిని ప్రశాంతంగా సాగేలా అధికారులు తమ వంతు చర్యలు తీసుకున్నారు.

## నాచగిరి శివాలయంలో విశేష పూజలు

**వర్గల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గల శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవంలో భాగంగా చివరి రోజు గురువారం విశేష పూజలు నిర్వహించడం జరిగింది. శివాలయం అర్చకులు త్రిగుల్లా విద్యాసాగర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, హవనములు, పూర్ణాహుతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత కృష్ణారావు దంపతులతో పాటు అర్చకులు రమేష్‌శర్మ, హరిప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహశర్మ, గోపాలకృష్ణశర్మ, నాగరాజుశర్మ, రామశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లన్న ఆలయంలో ఘనంగా పెద్దపట్నం

**మల్లన్న నామస్మరణతో మార్మోగిన తోటబావి ప్రాంగణం... తరలివచ్చిన భక్తజనం.. భక్తి శ్రద్ధలతో పట్నం దాటిన భక్తులు**

**కొమురవెల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మహాశివరాత్రిని పురస్కరించుకొని తెల్లవారుజామున స్వామివారి పెద్దపట్నం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గర్భాలయంలో లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామంలోని పురవీధుల్లో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ ఊరేగించారు. అనంతరం తోటబావి వద్ద పెద్దపట్నం కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలాహలంగా సాగిన పెద్దపట్నం సుమారు 3 గంటలకుపైగా ఒగ్గు కళాకారులు పంచ వర్ణాలతో 41 వరుసలతో పెద్ద పట్నాన్ని వేశారు. రాత్రంతా శివనామస్మరణతో జాగారాలు చేసి భక్తులు పెద్ద పటాన్ని తొక్కేందుకు ఉత్సాహం కనబరిచారు. ముందుగా పూజారులు ఉత్సవ విగ్రహాలను తీసుకొని పట్నం దాటారు అనంతరం భక్తులకు అనుమతించడంతో ఒక్కసారిగా పట్నంలోకి దూసుకొచ్చారు. ఈ క్రమంలో అక్కడ కొద్దిసేపు తోపులాట జరిగింది. అప్రమత్తమైన పోలీసులు భక్తులను క్రమ పద్దతిలో పంపించారు. పట్నం దాటి బండారు



పట్నం దాటుతున్న భక్తులు

తీసుకెళ్లేందుకు భక్తులు పోటీపడ్డారు. పట్నం దాటిన తర్వాత స్వామివారిని దర్శించుకున్నారు. శివ భక్తులకు ఆలయ సంప్రదాయం ప్రకారం బండారు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం మీద పెద్ద పట్నం కార్యక్రమం విజయవంతంగా ముగియడంతో ఆలయ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో రామాంజనేయులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, సేవా సమితి భక్తులు తదితరులు పాల్గొన్నారు. సీపీ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు హుస్నాబాద్ ఏసీపీ, చేర్యాల సీఐ శీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు ఆధ్వరయంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**జూనియర్ సివిల్ జడ్జ్, న్యాయమూర్తి సిరి సౌజన్య**

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మార్చి 8వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్‌న్యాయమూర్తి సిరి సౌజన్య అన్నారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మనకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ మార్చ్ నెల 8వ తేదీన (శనివారం) నర్సాపూర్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ కోర్టులో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో న్యాయమూర్తి సిరి సౌజన్య మాట్లాడుతూ రాజీ చేయదగ్గ కేసులలో కక్షిదారులు రాజీ చేసుకోవచ్చు అన్నారు, క్షణికావేశంలో తగాదాలు పడి కేసులు నమోదు చేసుకొని కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా కక్షిదారులు కోపతాపాలు పక్కనపెట్టి సామరస్యంగా ఇరువురు మాట్లాడుకుని రాజీ చేయదగ్గ కేసులలో రాజీ కుదుర్చుకొని జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయంతో సమన్వం పొంది కేసులు పరిష్కరించుకోవచ్చు అన్నారు, పోలీస్ అధికారులు రాజీ చేయదగ్గ నేరాలలో రాజీ కుదుర్చుకొనుటకు కక్షదారులకు చట్టబద్ధంగా సహాయ సహకారాలు అందించాలన్నారు. రాజీ చేయిదగ్గ కేసులలో రాజీ కుదుర్చుకొనుటకు జాతీయ లోక్ అదాలత్ కు ఇరువర్గాలు రాజీ కుదుర్చుకొని ఉంటే ప్రతిపాదించాలన్నారు, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి కక్షిదారులు ఇరువర్గాలు రాజీ కుదుర్చుకొని జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఆర్. రాఘవేంద్ర, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, ,పి. సుధాకర్, నర్సాపూర్ ఎక్సైజ్ సిఐ. ఎం. పద్మ, నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ. బి.అరుణ, చిలిపిచెడ్ ఏఎస్ఐ. మిస్బోద్దీన్, నర్సాపూర్ బార్ ప్రెసిడెంట్ డి. శ్రీధర్ రెడ్డి, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ న్యాయవాది మధుశ్రీ, లీగల్ సర్వీస్ న్యాయవాది బి.స్వరూప రాణి, సీనియర్ న్యాయవాదులు ఈ.సత్యనారాయణ, ఆర్.శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు ఏ.సాయిరాం, జె, రవి నాయక్, నర్సాపూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం సాయిరాం, నర్సాపూర్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్, శివంపేట్ కోర్ట్ కానిస్టేబుల్ హరిబాబు గౌడ్, చిలప్ చెడు కోర్ట్ కానిస్టేబుల్ శ్రీనివాస్, లీగల్ సర్వీస్ స్పోర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్చి 8న నారాయణఖేడ్‌లో లోక్ అదాలత్
## ఎస్ఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త:** మార్చి 8న నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్ పట్టణంలోని జెఎఫ్‌సిఎం కోర్టులో లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే పలు ప్రయోజనాలు (సమయం, డబ్బు) ఉంటాయన్నారు. తమ కేసులను రాజీ చేసుకునే వారు మార్చి 1వ తారీఖు నుంచి 8వ తేదీ వరకు పోలీసు రాణాలో లేదా కోర్టులో కాని హాజరయితే వారిని కోర్టులో ప్రవేశపెట్టి సంబంధిత కేసును (యాక్సిడెంట్, కొట్టుకున్నవి, చీటింగ్, చిట్‌ఫండ్, భూతగాదాలు, వివాహ బంధానికి సంబంధించినవి, చిన్న చిన్న దొంగతనాలు, అక్రమ రవాణ (ఇసుక, మట్టి, కట్టెలు, మద్యం తదితర, పేకాట కేసులు) పూర్తిగా మూసేస్తామన్నారు. కక్షిదారులు తమ అదార్‌కార్డులతో హాజరై లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు.

## కేతకి ఆలయంలో ఘనంగా వాహన సేవ

**ఝరాసంగం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలో శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి నవాహానిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం అందంగా అలంకరించిన వాహనంలోస్వామి వారికి వాహన సేవ నిర్వహించారు. వాహన సేవ ముందు వీరభద్ర దండకాలు, హంసలు కేరళ బ్యాండు, డోలు సన్నాయి, తమ్మలి బాజాలు వాయిస్తుండగా వాహన సేవలో పార్వతీ పరమేశ్వరులు భక్తులు దర్శనం ఇచ్చారు. జాతర ఉత్సవాలకు కర్ణాటకలోని కలబురిగి జిల్లా ఎస్పి ఏ శ్రీనివాసులు హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ అర్చకులు ఎస్పికి ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శివరుద్రప్ప, ఎస్సై నరేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. ఈ నెల 8వ తారీఖున ఆలయ ఆవరణలో ఉదయం 6గంటలకు అగ్ని దహనం, 10గంటలకు స్వామి వారి కళ్యాణోత్సవం, స్వామి వారి విమాన రథం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.



ఓటింగ్ సరళిని పరిశీలించిన ఆంజనేయులుగౌడ్ తదితరులు

## ఎన్నికల సరళిని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్త, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, లలిత నర్సింగ్ నాయక్, రుస్తుంపేట అశోక్, హబీబ్‌ఖాన్, రాధాకృష్ణ గౌడ్, అశోక్‌గౌడ్ పరిశీలించారు. నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కరీంనగర్ నిజాంబాద్ అదిలాబాద్ మెదక్ ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళిని బట్టి అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి తప్పకుండా విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

## ఘనంగా మల్లికార్జునస్వామి అగ్నిగుండాలు

**-జాతర ఉత్సవాల్లో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**మర్కుక్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని నర్సన్నపేటలో గల మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు రెండవ రోజు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం మల్లికార్జునస్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించగా నర్సన్నపేట గ్రామంతో పాటు పరిసరగ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం ఒగ్గు కళాకారుల కథలు, శివసత్తుల సిగాలు, డోలు వాయిద్యాలతో అగ్నిగుండాలు దాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిగుండం దాటేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ జాతర ఉత్సవాలకు మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపిపి పాండుగౌడ్, మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించి అగ్నిగుండం దాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా హాజరైన అతిథులను ఆలయ నిర్వాహకులు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవి రాజిరెడ్డి, నాయకులు నర్సింలు, మధుసూదన్‌రెడ్డి, పర్వతాలు, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## రేపు రాజరాజేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కింపు

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండలంలోని పొట్లపల్లి గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని రేపు(శనివారం) ఉదయం 10 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని ఆలయ ఈవో కిషన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆసక్తి గల భక్తులు ఈ లెక్కింపులో పాల్గొవాలని సూచించారు.

## సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ : ఎమ్మెల్సీ

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా గజ్వేల్ పట్టణంలో ఏర్పాటుచేసిన శివానందలహరి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం రోజున లయన్స్ క్లబ్ వారు ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, భాస్కర్, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గోలి సంతోష్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశంగౌడ్, లయన్ పరమేశ్వరచారి, నేతి శ్రీనివాస్, రచయిత, కవి, గాయకుడు విశ్వేశ్వరరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## గజ్వేల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

**-అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసుల బందోబస్తు**

**గజ్వేల్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గజ్వేల్‌లో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని సెంట్ జోసెఫ్ పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా గజ్వేల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మండల వ్యాప్తంగా పట్టభద్రులు 3530 మంది ఓటర్లు ఉండగా 2729 మంది ఓటర్లు తమ ఓటు వేశారు. అలాగే ఉపాధ్యాయులు 495 మంది ఉండగా 471 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు పోలింగ్ స్టేషన్ వద్ద తమ తమ అభ్యర్థులకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూరి నరేందర్‌రెడ్డికి మద్దతుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి కార్యకర్తలతో కలిసి ఉదయం నుండి సాయంత్రం వరకు పోలింగ్ స్టేషన్ వద్దనే ఉండి తమ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓటు వేయాలని కోరారు. అలాగే బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, స్థానిక బిజెపి నాయకులు కప్పర ప్రసాద్‌రావు, జశ్వంత్‌రెడ్డి, మనోహర్‌యాదవ్, సురేష్‌లు ప్రచారం నిర్వహించారు. బిఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన ప్రసన్న హరికృష్ణకు మద్దతు గా యువత, పట్టభద్రులు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం నిర్వహించారు. ఏదిఏమైనా గజ్వేల్ పట్టణంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ కనిపించింది. ఎలాంటి సంఘటనలు జరుగకుండా గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో సిఐ సైదా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నర్సాపూర్‌లో...**



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న డిఎస్‌పి వెంకటరెడ్డి, ఎస్ఐ లింగం

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికల సందర్భంగా తూప్రాన్ డిఎస్పి వెంకట్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ లింగంకు, పోలీసులకు ఆయన సూచించారు. నర్సాపూర్ పట్టభద్రులు 923 మంది ఉండగా 462 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో 145 మంది ఉపాధ్యాయులు ఉండగా కేవలం 73 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రుల పోలింగ్ శాతం 70.75 కాగా ఉపాధ్యాయుల పోలింగ్ శాతం 97.93 శాతంగా నమోదైనట్లు అధికార వర్గాలు తెలిపాయి.

**ఒకే కౌంటర్ ఏర్పాటుతో ఇబ్బందులు...**

నర్సాపూర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఒకే ఒక కౌంటర్ ఉండటంతో ఓటర్లు అనేక ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా ఉదయం నుండే ఓటర్లు ఓటు హక్కులు వినియోగించడానికి బారులు తీరారు. పట్టభద్రుల పోలింగ్ కేంద్రంలో కౌంటర్ ఒకటే ఉండడంతో 54 మంది మొత్తం అభ్యర్థులు ఉండగా ఓటు వేయడానికి ఆలస్యం అవుతుంది. దీంతో పట్టభద్రుల ఓటర్లు క్యూలో నిల్చడానికి ఇబ్బంది పడ్డారు. ఈ మేరకు కొందరు ఈ పోలింగ్ కేంద్రంలో మరో కౌంటర్ ను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం లేకపోగా ఓటర్లు ఇబ్బందులు పడుతూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ మేరకు నర్సాపూర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ప్రశాంతంగా సజావుగా పోలింగ్ ప్రక్రియ సాగింది.

**ములుగులో...**



ములుగులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రకళ

**ములుగు, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటల వరకు ఉపాధ్యాయుల ఓటింగ్ 82.5 శాతం పోలు కాగా పట్టభద్రుల పోలింగ్ 52.69 శాతం ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి మండలంలో మొత్తం ఉపాధ్యాయుల ఓట్లు 80 ఉండగా 77 ఓట్లు పోలు కాగా 96.25 శాతం, పట్టభద్రులు 501 ఉండగా 444 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 88.62 శాతం నమోదు అయ్యిందని తహసీల్దార్ ఆరీఫా తెలిపారు. మధ్యాహ్నం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ ఆరీఫాలు పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. సమయం ముగిసే వరకు ప్రశాంతంగా పోలింగ్ జరిగేవిధంగా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఎన్నికల సరళిని పరిశీలించిన బిజెపి నాయకులు

**నర్సాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల ఓటింగ్ సరళిని బిజెపి నాయకులు పరిశీలించారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నర్సాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి గోద రాజేందర్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వనముల బుచ్చేష్ యాదవ్ ,నర్సాపూర్ టౌన్ ప్రెసిడెంట్ నిరుడి చంద్రయ్య, నర్సాపూర్ రూరల్ అధ్యక్షులు నీలి నగేష్ , జిల్లా సీనియర్ నాయకులు నారాయణ రెడ్డి , నాగరాజ్ ,దేవేందర్ యాదవ్, మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించిన బిజెపి నాయకులు

# సిద్దిపేట జిల్లాలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడిజిల్లాల పట్టుభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం నిర్వహించిన పోలింగ్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. రెండు ఎమ్మెల్సీ ఎన్నికకుగానూ జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని ఆయామండలాల్లో 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి గానూ 15, పట్టభద్రుల ఎమ్మెల్సీకిగానూ 56 మంది బరిలో నిలిచారు. జిల్లాలో మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు 3212 మంది ఉండగా 3046 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టభద్రులు 32 589 మంది ఓటర్లు ఉండగా 23736 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 8853 మంది పట్టభద్రులు, 166 మంది ఉపాధ్యాయులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. పట్టభద్రులు ఉత్సహంతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి గానూ ఉపాధ్యాయ ఓటర్లు ఉదయం పూట పెద్దగా పోలింగ్‌లో పాల్గొనలేదు దీంతో మధ్యాహ్నంవరకు ఉపాధ్యాయ పోలింగ్ మందకొడిగా సాగింది. సాయంత్రం పూట తిరిగి ఉపాధ్యాయ ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ కోసం అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి చిన్న కోడూరు, సిద్దిపేటలో పర్యటించి పోలింగ్ తీరును



ఓటు హక్కును వినియోగించుకోవడానికి క్యూలో నిలబడిన పట్టభద్రులు

ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీపీ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో పటిష్టమైన బందో బస్తు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్స్‌లను పోలీసు బందోబస్తు మధ్య కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి**

జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గానూ గురువారం నిర్వహించిన పోలింగ్‌లో ప్రముఖులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాల్ జిల్లాల పట్టుభద్రల ఎన్నికల పోలింగ్‌లో రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తన సతీమణితో కలిసి హుస్నాబాద్ పట్టణంలో. మెదక్ ఎంపి రఘునందన్‌రావు ఆయన సతీమణి మంజుల అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సిద్దిపేట పట్టణంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు), మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ దంపతులు చిన్నకోడూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## పోలింగ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మనూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం పరిశీలించారు. ఓటర్లకుఇబ్బందులు కల్గకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దిగంబర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పురంజన్, సుభాష్‌రావు పాటిల్, యూ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సిద్దరెడ్డి, బిరదర్‌దత్తు, శ్రీకాంత్, సాయిలు, విజయ్‌కుమార్, వినోద్‌కుమార్, అమృత్, అశోక్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకరపప, ఖలెద్ పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న కార్పొరేటర్


ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్న కార్పొరేటర్ దంపతులు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు గురువారం రామచంద్రాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా ముగిసాయి. ఎన్నికలను పురష్కరించుకుని భారతీ నగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ, బిఆర్ఎష్ రాష్ట్ర నాయకులు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు.

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ ఎస్‌లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 252 మంది పట్టభత్రులు ఓటు హక్కును కలిగి ఉండగా 175 మంది, ఉపాధ్యాయులు10 మంది ఉండగా 10 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా డిఎస్‌పి వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు.

**చిన్నశంకరంపేటలో...**


ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంలో పట్టబద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను ఆర్డీవో రమాదేవి హాసీల్దార్ మన్నన్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఏసీపీ మహెందర్‌రెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మెదక్ ఎమ్మెల్సీ స్థానానికి గాను జరిగిన ఎన్నికల్లో 565 మంది పట్టబద్రులు ఉండగా 395 మంది ఓటు వేశారని, ఉపాధ్యాయ ఓటర్లు 41 మందికిగాను 40 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి ఝాన్సి తెలిపారు. ఉపాధ్యాయులు 98 శాతం, పట్టభద్రులు 69.91 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఆమె తెలిపారు.

## జిన్నారంలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన నీలం మధు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిన్నారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు నీలం మధు పరిశీలించారు. పోలింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బొల్లారం మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, కార్మిక సంఘం నాయకులు వరప్రసాద్ రెడ్డి, నాయకులు రాజు గౌడ్, నారబోయిన శ్రీనివాస్, సుంకరబోయిన మహేష్, వీర్నల సత్యనారాయణ, శ్రీశైలం,వెంకటేష్, అశోక్, నారాయణ రెడ్డి, వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులకు విద్యార్హత తప్పనిసరి చేయాలి

### నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్


ఓటు హక్కు వినియోగించుకున్న మెట్టు శ్రీధర్

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కును నవభారత్ నిర్మాన్ యువసేన అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ వినియోగించుకున్నారు. భవిష్యత్‌లో ప్రజాప్రతినిధు లకు విద్యార్హత తప్పనిసరి చేసేవిధంగా వ్యవస్థలో మార్పులు తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. స్వాతంత్ర్యనంతరం అక్షరాస్యులు తక్కువగా ఉండటం వల్ల ప్రజాప్రతినిధులకు విద్యార్హత తప్పనిసరి చేయలేదని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తాము ఎటువంటి పత్రాలపై సంతకం చేస్తున్నామో తెలియని పరిస్థితుల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు ఉండటం ఇబ్బందికరమని మెట్టు శ్రీధర్ పేర్కొన్నారు.

## మండలంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**సిర్గాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 314 మంది పట్టభత్రులు ఓటు హక్కు పొంది ఉండగా 225మంది, ఉపాధ్యాయులు29 మంది ఓటు హక్కు కలిగి ఉండగా 28 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.


సిర్గాపూర్‌లో ఓటు వేసిన పట్టభద్రులు


బండ్ల ఊరేగింపు దృశ్యం


అమ్మవారికి బోనాల ఊరేగింపు దృశ్యం

# వన జాతరకు...జన హారతి

**-2వ రోజు ఘనంగా బండ్ల ఊరేగింపు.. శివమెత్తిన శివసత్తులు బోనమెత్తి పూనకాలు**

**పాపన్నపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మంజీర నీటి సవ్వడులు...కాడెద్ల గజ్జల సప్పుళ్లు... డప్పుల దరువుల..శివసత్తుల ఆటలు..పోతురాజుల గావుకేకలతో ఏడుపాయల కొండకోనలు దుర్గమ్మ నామస్మరనతో దద్దరిలుతోంది.మూడురోజుల జాతరలో ముఖ్య ఘట్టమైన బండ్ల ఊరేగింపు గురువారం ఘనంగా కొనసాగింది.

**పోతురాజుల గావుకేకలు-బోనాలతో నృత్యాలు...**

పోతురాజుల నృత్యాలు కనువిందు చేశాయి. శివ సత్తుల గజ్జెలతో ఆలయ పరిసరాలు దద్దరిల్లాయి. అమ్మవారి ఆలయం ముందు తిప్పే బండ్లను రవికలు, చీరలు, కొబ్బరి మట్టలు, దేవతామూర్తుల చిత్ర పటాలు, రంగు రంగు మెరుపు కాగితాలతో అందంగా అలంకరించి చూపురులను ఆకట్టుకునేలా ఊరేగింపు నిర్వహించారు. బొనాలు భక్తులను ఆకటుకున్నాయి. ఉదయం భక్తులు మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని భక్తి శ్రద్దలతో దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకున్నారు.

**కనుల పండువగా బండ్ల ఊరేగింపు...**

ఆలయ మహాజాతర ఉత్సవాల్లోభాగంగా రెండవ రోజు బండ్ల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పాపన్నపేట సంస్థానాధీశుల బండికి ఆలయ అధికారులు స్వాగతం పలకగా బండి వెనక 110 బండిఉండగా ఎడ్లబండ్ల ముందు డప్పు చప్పుళ్లకు అనుగుణంగా యువకులు చిందులేస్తూ దుర్గమ్మను స్మరిస్తూ లక్షలాది మంది భక్తులు మధ్య బండ్ల ఊరేగింను నేత్రపర్వంగా కొనసాగింది. బండ్ల ఊరేగింపులో నాయకులు శెట్టి శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, గురుమూర్తిగౌడ్, కిషన్‌రెడ్డి, నరేదర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సుంకరి కిష్టయ్య, దోసని సంగమేష్, భూమాగౌడ్, రవీందర్, రవి పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కళా ప్రదర్శన...**

జాతర ఉత్సవాల్లో భాగంగా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కళా ప్రదర్శన భక్తులను కనువిందు చేసింది. కళాకారులు జానపద సంస్కృతి అద్దంపట్టే విధంగా పాటల రూపంలో నృత్యాలుచేస్తూ పాడిన పాటలకు భక్తులు ఈలలు వేస్తూ నృత్యాలు చేస్తూ కళాకారులను ప్రోస్తాహించారు.

**దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్సీ...**

ఎమ్మెల్సీ దంపతులకు ఇఓ చంద్రశేఖర్ ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా వరు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఎమ్మెల్సీ దంపతులు ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందచేయగా ఇఓ చంద్రశేఖర్ శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్సీ వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ బాలాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లింగారెడ్డి, గంగారెడ్డి గారి సాయిరెడ్డి, బాపారావు, సంజీవరెడ్డి, మహిపాల్‌రెడ్డి ఉన్నారు.

**భారీ బందోబస్తు...**

మూడు రోజుల పాటు కొనసాగే జాతర ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు 1000 మంది పోలీసులతో, 220 సిసి కెమెరాలతో డేగ కన్నులతో భారీ బందోబస్తు, నిఘా నిర్వహించారు. మెదక్ ఎస్‌పి ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎప్పటికప్పుడు జాతరను పర్యవేక్షిస్తూ పోలీసు అధికారులను అప్రమత్తం చేస్తూ ఉన్నారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లను క్షుణంగా పరిశీలిస్తున్నారు.

**నేడు రథోత్సవం...**

మూడు రోజుల జాతర ఉత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం రథోత్సవ కార్యక్రమం నేత్ర పర్వంగా కొనసాగుతోంది. రథాన్ని రంగు రంగు కాగితాలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి రాత్రికి రథాన్ని ఆలయ పరిసరాల్లో ఊరేగింపు నిర్వహిస్తారు.


అల్లాదుర్గంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లయ్య

## అల్లాదుర్గంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పాఠశాలలో పోలింగ్ జరుగుతున్న తీరును తహసీల్దార్ మల్లయ్య పరిశీలిస్తూ వచ్చారు. మండలంలో 447మంది పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉండగా 328 మంది ఓటు హక్కును, 11 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు పొంది ఉండగా 11 మంది తమ ఓటును వినియోగించుకున్నారని తహసీల్దార్ వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా ఎఎస్‌ఐ తుకారాం తన సిబ్బందితో తగు చర్యలు తీసుకున్నారు.

**ఖేడ్‌లో...**


ఎన్నికలసరళిని పరిశీలిస్తున్న అదనపుఎస్పీ సంజీవరావు, డిఎస్‌పి వెంకట్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టణంలో గురువారం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ప్రశాంతంగా ముగిసాయి. డివిజన్‌లో పట్టభద్రులు 224 ఉండగా 212 మంది (మనూర్‌లో 16 మందికి 15 మంది, కంగ్టిలో 38 మందికి 35 మంది, కల్హేర్‌లో35 మందికి 35 మంది, సిర్గాపూర్‌లో 29 మందికి 28 మంది,నాగల్‌గిద్దలో 10 మందికి 10 మంది, నిజాంపేట్‌లో 23 మందికి 23 మంది) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3577 మంది ఉపాధ్యాయులకు గాను 1681 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా డిఎస్‌పి వెంకట్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలంలు తమ సిబ్బందితో తగు చర్యలు తీసుకున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న నరోత్తం

**జహీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కును వినియోగించుకుంటున్న మాజీ చైర్మన్ నరోత్తం


మనూర్‌లో ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మాజీ ఎంపి బిబి పాటిల్

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయం తథ్యం

### -మాజీ ఎంపి బిబి పాటిల్

**మనూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి సి అంజిరెడ్డి విజయం సాధించడం తథ్యమని మాజీ ఎంపి బిబి పాటిల్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు సి గోదావరిలు అన్నారు. మండల కేంద్రమైన మనూర్‌లో కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని బిబి పాటిల్, గోదావరిలు పరిశీలించారు.ఈ సందర్బంగా బిబి పాటిల్, గోదావరిలు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోది చేసిన సంక్షేమ పథకాలు బిజెపి అభ్యర్థులను గెలిపించనున్నాయన్నారు.

## పోలింగ్ సరళిని పరిశీలించిన ప్రముఖులు


ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

**జహీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** గురువారం జహీరాబాద్‌లో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, మాజీ ఎంపి బిబిపాటిల్ గురువారం వేర్వేరుగా పరిశీలించారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేందుకు నాయకులు కృషి చేశారు.

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. 2026 మంది పట్టభద్రులకు గాను 1484 మంది, 145 మంది ఉపాధ్యాయులకు గాను 124 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా పోలీసులు, రెవిన్యూ అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల్లో బారులు తీరిన పట్టభద్రులు

# రామాయంపేటలో 72 శాతం పోలింగ్

**రామాయంపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు(మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్) గురువారం ప్రశాంతంగా ముగిసాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 72 శాతం నమోదైనట్లు తహసీల్దార్ రజినికుమారి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ స్టేషన్ లోపల ఉన్న 117 మంది ఓటర్లకు అధికారులు స్లిప్పులు ఇచ్చివారు ఓటు వేసే వరకు చర్యలు తీసుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 223, 81 రెండు పోలింగ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా ఉన్నతాధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల, ఉపాధ్యాయుల పోలింగ్‌స్టేషన్‌లను మెదక్ ఆర్డీవో రమాదేవి రామాయంపేట తహశీల్దార్ రజనీ కుమారితో కలిసి ఆకస్మికంగా సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రామాయంపేట ఎస్‌ఐ బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాలవద్ద 144 సెక్షన్ విధించి, బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం మీద పట్టభద్రులు 950 మంది ఉండగా అందులో (పురుషులు 429, మహిళలు 223 మంది) ఉపాధ్యాయులు 81 మంది ఓటర్లు (అందులో 64 మంది పురుషులు, 17 మంది మహిళలు) ఉన్నారు. రెండు పోలింగ్‌స్టేషన్‌లో ఓటర్లు బారులుతీరి, ఓటు హక్కును వినియోగించుకున్నారు. తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రధానోపాధ్యాయుడు నవాత్ సరేష్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.


మాట్లాడుతున్న మెదక్ ఆర్డీవో రమాదేవి


ఓటు హక్కును వినియోగించుకున్న తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ దంపతులు

**నిజాంపేటలో...**

నిజాంపేటలో గురువారం పట్టభద్రుల, టీచర్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మెదక్ ఆర్డీవో రమాదేవి పోలింగ్‌స్టేషన్లను సందర్శించారు. పట్టభద్రులు 535, టీచర్లు 35 మంది ఓటర్లు ఉన్నారని, ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘలనలు జరగకుండా పోలీస్ భద్రత కలినపంచామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి పట్టభద్రులకు సంబంధించి 69 శాతం, టీచర్లకు సంబంధించి 100కు 100 శాతం పోలింగ్ అయినట్లు తహశీల్దార్ సురేష్ కుమార్ అన్నారు. పోలింగ్ బాక్సులను కరీంనగర్ తరలించినట్లు తెలిపారు.

## అందోలులో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**జోగిపేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ, పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అందోలులో ప్రశాంతంగా జరిగాయి. అందోలు డివిజన్ పరిధిలో మొత్తం ఐదు పట్టబద్రులకు, నాలుగు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు సంబంధించి మండల కేంద్రాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అందోలు నియోజకవర్గం పరిధిలోని అందోలు, పుల్కల్, చౌటకూరు, వట్‌పల్లి మండలాల్లో పట్టబద్రుల ఓటర్లు 2437 మంది ఉండగా, ఉపాధ్యాయ ఓటర్లు 185 మంది ఉన్నారు. కాగా గురువారం ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎక్కువమంది వచ్చారు. అయితే మధ్యాహ్నానికి పోలింగ్ ప్రక్రియ మందగించి, తిరిగి చివరి గంటలో పుంజుకుంది. అందోలులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పట్టబద్రుల నియోకవర్గానికి సంబంధించి ఒక బూత్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉండటంతో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఇబ్బందిపడ్డారు. ఈ బూత్‌లో నాలుగు గంటల సమయం ముగిసినప్పటికీ ఇంకా వందమంది ఓటర్ల వరకు లైన్లో నిల్చుని ఉన్నారు. దీంతో గేట్లు మూసివేసి లోపల ఉన్నవారికి నెంబర్లువేసి ఓటు హక్కు వినియోగించుకునేందుకు చిట్టీలు ఇచ్చారు. మొత్తానికి అందోలులో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఇక్కడ పట్టబద్రుల నియోజకవర్గానికి సంబంధించి 76.08శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 91.89శాతం ఓటింగ్ నమోదైంది.

## నంది వాహనంపై ఊరేగిన శివపార్వతులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని కాశీనాథ ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం నంది వాహన సేవపై శివపార్వతులను ఊరేగింపు బ్రహ్మశ్రీ గురురాజ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు అనంతరం శివపార్వతుల కళ్యాణోత్సవం కనుల పండువగా కొనసాగింది. మహాశివరాత్రి రోజు రాత్రి జాగరణ చేసి శివపార్వతులను స్మరిస్తే బోళా శంకరుడి కృపకు పాత్రులవుతారని పరోహితులు గురనాథ్‌శర్మ పేర్కొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కళ్యాణోత్సవం

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని మండల పరిధిలోని పంచగామలో గురువారం పీఠాధిపతి కాశీనాథ్ బాబ సమక్షంలో శివపార్వతుల కళ్యాణోత్సవం నేత్ర పర్వంగా కొనసాగింది. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తుల శివ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణఖేడ్ ప్రజలతో పాటు పరిసరాల గ్రామాలు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని కళ్యాణోత్సవాన్ని కనులారా వీక్షించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**సిర్గాపూర్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీమల్‌పాడ్ గ్రామానికి చెందిన బావుగే నీలమ్మ అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సిఎంఆర్ఎఫ్ పథకంలో రూ. 14,500 మంజూరు చేయించి గురువారం బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందచేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయరెడ్డి, నారాయణఖేడ్ మాజీ జడ్పీటిసి సభ్యులు లక్ష్మీబాయి రవీందర్ నాయక్, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు నగేష్ సేట్, టిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు అంజాగౌడ్, కురుమ సంఘం తాలుకా ఉపాధ్యక్షులు మల్గొండ, పార్టీ మండల యువత అధ్యక్షులు మచ్చందర్, నాయకులు బసవరాజ్, చింటూ నరేష్‌లు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**శివ్వంపేట, ఫిబ్రవరి 27(ప్రభాతవార్త) :** సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని మాజీ జిల్లా కోప్షన్స్ సభ్యులు మాన్సూర్ అన్నారు. మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన పోచగౌడ్‌కు మంజూరైన రూ. 51 వేల చెక్కు, రత్నాపూర్ గ్రామానికి చెందిన పోచయ్యకు రూ. 17,500 చెక్కును బాధిత కుటుంబానికి జిల్లా కోప్షన్స్ మాజీ సభ్యుడు మాన్సూర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లూరి ముత్యాలు, ఆకుల శ్రీనివాస్, రామ్‌చంద్రర్‌గౌడ్, బోగ్గుల యాదగిరి, నువ్వుల దశరథ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఓం ప్రకాష్

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా మండల పరిధిలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన సామాజిక సేవకర్త, రక్తదాత డిఓం ప్రకాష్‌ను నియమించారు. జిల్లాలో మానవ హక్కుల ఉల్లంఘన జరిగితే బాధితులకు అండగా ఉంటానని ఓం ప్రకాష్ హామి చేశారు. జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ నవోదయ సిద్దుకు, అందుకు సహకరించిన క-ఆర్డినేటర్ డాక్టర్ దిబ్బే బాబురావు, సంయుక్త కార్యదర్శి కోటారి నర్సింలులకు ఓం ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగ భవిష్య నిధిపై అవగాహన

**కంది, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇంద్రకరణ్ పారిశ్రామికవాడలో ఆరబిందో రీసెర్చ్ సెంటర్-2 (ఈపీఎఫ్ఓ)లో గురువారం ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ పింఛన్ల విభాగం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఈపీఎఫ్ఓ ప్రాంతీయ కన్వీనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం భవిష్య నిధి సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఆయా పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగ విరమణ పొందిన వారికి అదే రోజు పెన్షన్ పత్రాలు అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈపీఎఫ్ఓ అధికారి శ్రీదేవి, ఆయా సంస్థల హెచ్‌ఆర్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే శారీరక,మానసిక ఉల్లాసం : ఎస్ఐ

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** ఆటలతో మానసిక,శారీరక ఉల్లాసం సాధ్యమవుతుందని స్థానిక ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. గురువారం మండల పరిధి రుద్రారంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. గ్రామంలో సంగమేశ్వర ఆలయ ఉత్సవాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌నునిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచి లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్, నిర్వాహకులు పాశ, ప్రవీణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

### -ఒంటరైన కుమార్తె

**పుల్‌కల్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం నుంచి కింద పడి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ వివాహిత మహిళ మృతి చెందిన సంఘటనకు సంబంధించి ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. చౌటకూరు మండలం బొమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొమ్మరాజు శోభ (41) జోగిపేటల కిరాణ సమాగ్రి తీసుకుని తన బంధువుల బైక్‌పై స్వగ్రామానికి వస్తున్న క్రమంలో చౌటకూరు మండల శివారులోని ఇటుకబట్టి వద్ద బైక్ అదుపుతప్పగా ప్రమాదంలో శోభకు తీవ్ర గాయాలయ్యాయి. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ శోభ తిరిగిరాని లోకాలకు చేరిపోయిందన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**కొల్చారం, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులోగల ఏడుపాయల దేవస్థానానికివెళ్లే మొదటి వంతెన ఎడమ వైపు ఫుట్‌పాత్‌పై ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. అతడి వయస్సు 35 నుండి 40 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై బూడిద రంగు ఫుల్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ పాయింట్, చాక్లెట్ కలర్ డ్రాయర్ ఉందని పోలీసులు తెలిపారు. కుడి చేయికి పసుపు పచ్చని, ఎరుపురంగు దారం ఉందని వివరించారు. పోతంశెట్టిపల్లి పంచాయతీ సెక్రెటరీ అరుధంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. అతడి ఆచూకీ తెలిసిన వారు 8712657919, 8712657916 నెంబర్‌లలో తెలపాలని కోరారు.

## చెరువులో పడి మహిళ మృతి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధి సూరారం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... ఇదే గ్రామానికి సావిత్రి(39), బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని పెద్ద చెరువు వద్దకు బట్టలు ఉతకడానికి వెళ్లి రాత్రి అయినప్పటికి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చెరువు దగ్గరికి వెళ్లి చూడగా నీటిలో సావిత్రి మృతదేహం వారికి లభ్యమైంది. ప్రమాదవశాత్తు సావిత్రి నీటిలో పడి మృతి చెందిందని భర్త దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.